# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 8, జూన్ 2026


# కోటపల్లిలో బాలికపై అత్యాచారం



- పోక్సో కేసు నమోదు, ప్రత్యేక దర్యాప్తు
- రామగుండం సీపీ, మంచిర్యాల డీసీపీ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు
- బాధిత కుటుంబానికి న్యాయం చేస్తాం: జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

కోటపల్లి, జూన్ 07 ప్రభాతవార్త

కోటపల్లి మండలంలో ఒక మైనర్ బాలికపై అత్యాచారం జరిగిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చెన్నూరు మండలానికి చెందిన ఒక మహిళ తన మైనర్ కూతురిని కోటపల్లి మండలంలోని తమ అమ్మమ్మ ఇంటికి తీసుకు వచ్చింది. ఈ క్రమంలో ఈ నెల 4వ తేదీన ఉదయం సమయంలో బాలిక గ్రామంలో ఆడుకుంటూ ఉండగా, అదే గ్రామానికి చెందిన ఒక బాలుడు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధిత బాలిక తల్లి ఇచ్చిన రాతపూర్వక ఫిర్యాదు మేరకు కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రాజశేఖర్ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ కేసును అన్ని కోణాల్లో నిష్పక్షపాతంగా విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఘటనను అత్యంత ప్రాధాన్యత మిగతా 2లో..




# తల్లిదండ్రులకు తీరని ఆర్థిక భారం..

# ఫీజుల దోపిడీ..!

మందమర్రి, జూన్ 07, ప్రభాతవార్త

**కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు, పాఠ్యపుస్తకాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మధ్యతరగతి, పేద కుటుంబాలపై విద్యా ఖర్చులు మరింత భారంగా మారాయి. పిల్లల భవిష్యత్తు కోసం ఎంత కష్టమైనా చదివించాలని భావిస్తున్న తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల ఫీజులు, పుస్తకాల కొనుగోళ్ల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠ్యపుస్తకాల పేరుతో వేల రూపాయల వసూళ్లు, ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ గుర్తింపు పొందిన పుస్తకాలతో పాటు ప్రత్యేకంగా తమ పాఠశాల పేరుతో ముద్రించిన నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, ప్రాక్టీస్ బుక్స్‌ను కొనుగోలు చేయాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక విద్యార్థికి పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్‌లు కలిపి రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు అవుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థుల నుంచి ట్యూషన్ ఫీజులు, అడ్మిషన్ ఫీజులు, వార్షిక నిర్వహణ ఫీజులు, కంప్యూటర్ ఫీజులు, ట్రాన్స్‌పోర్ట్ ఫీజుల పేరుతో భారీ మొత్తాలు వసూలు చేస్తున్నట్లు పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో ఫీజులు గత ఏడాదితో పోలిస్తే 10 నుంచి 30 శాతం వరకు పెరిగినట్లు తెలుస్తోంది. అప్పులు చేసి చదివిస్తున్న తల్లిదండ్రులు, రోజువారీ కూలీలు, చిన్న వ్యాపారులు, ప్రైవేట్ ఉద్యోగులు తమ పిల్లల చదువుల కోసం అప్పులు మిగతా 2లో..




# ప్రజల భద్రతే పోలీసుశాఖ లక్ష్యం

★ డీఎస్పీ వహీదుద్దీన్ ★ కాగజ్‌నగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

★ 48 వాహనాలకు జరిమానా



కాగజ్‌నగర్ రూరల్, జూన్ 7, ప్రభాతవార్త :

ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన వాహనాల తనిఖీల్లో సరైన పత్రాలు లేని 45 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు, ఒక ట్రాలీపై జరిమానాలు విధించినట్లు తెలిపారు. మొత్తం 48 వాహనాలపై చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రజల్లో రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని డీఎస్పీ తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటుబెల్ట్ ధరించాలని సూచించారు. సైబర్ నేరాల మిగతా 2లో..



# తప్పిన పెను ప్రమాదం

టోల్ ప్లాజా వద్ద ఆర్టీసీ బస్సు బోల్తా...

మందమర్రి, జూన్ 7, ప్రభాతవార్త



మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం సింగరేణి కేకే2 మైన్ ఓపెన్‌కాస్ట్ టోల్ ప్లాజా సమీపంలో ఆదివారం తెల్లవారుజామున ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. కొత్తగూడెం నుంచి బెల్లంపల్లికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఉదయం సుమారు 4 గంటల సమయంలో టోల్ ప్లాజా వద్ద అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో కేవలం ఒక్క ప్రయాణికుడు మాత్రమే ఉండటంతో అతను ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడినట్లు సమాచారం. బస్సులో ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు, అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనలో బస్సు డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా, సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. టోల్ ప్లాజా సిబ్బంది సైతం వెంటనే స్పందించి రోడ్డుపై బోల్తా పడిన బస్సును తొలగించి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై ఇంకా స్పష్టత రాలేదని పోలీసులు తెలిపారు. బస్సు అతివేగంగా నడపడం వల్ల ప్రమాదం జరిగిందా, లేక తెల్లవారుజామున డ్రైవర్ నిద్రమత్తులో ఉండటం కారణమా అనే కోణాల్లో విచారణ చేపడుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపగా, ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం పట్ల అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# ఫీజుల దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

చేయాల్సి వస్తోందని చెబుతున్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలు చదువుతుంటే పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోందని వారు పేర్కొంటున్నారు.

## ప్రభుత్వ పర్యవేక్షణ అవసరం..

విద్య హక్కు అయినప్పటికీ, ప్రైవేట్ పాఠశాలల్లో నియంత్రణ లేకుండా ఫీజులు వసూలు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫీజుల నియంత్రణ, పాఠ్యపుస్తకాల ధరలపై ప్రభుత్వం ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి, తల్లిదండ్రులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించాలని విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. తల్లిదండ్రుల విజ్ఞప్తి, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల పెంపు, పాఠ్యపుస్తకాల ధరలపై జిల్లా విద్యాశాఖ అధికారులు దృష్టి సారించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్య హక్కు... వ్యాపారం కాకూడదు, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన విద్య అందించడం పాఠశాలల బాధ్యత. అయితే విద్యను వ్యాపారంగా మార్చి అధిక ఫీజులు, పుస్తకాల ధరలతో తల్లిదండ్రులపై భారం మోపడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# కోటపల్లిలో బాలికపై అత్యాచారం

(మొదటిపేజీ తరువాయి)

కలిగిన కేసుగా పరిగణించినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ ఆదేశాల మేరకు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చెన్నూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్. కృష్ణ ఈ కేసుపై ప్రత్యేక దర్యాప్తు ప్రారంభించారు. బాధిత కుటుంబానికి పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలను అత్యంత వేగవంతం చేశామని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జైపూర్ ఏసీపీ వెల్లడించారు.

# ప్రజల భద్రతే పోలీసుశాఖ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, లింకులు, ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసు శాఖను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ సీఐ ప్రేమ్ కుమార్, పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు గౌరవం, సముచిత స్థానం కల్పిస్తాం

**- తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్**

**తాండూర్, జూన్ 7, ప్రభాతవార్త :**

తొలి, మలి దశ ఉద్యమాలలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి గౌరవం, సముచిత స్థానం కల్పిస్తామని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్ అన్నారు. స్థానిక మినీ సురభి ఫంక్షన్ లో ఆదివారం తెలంగాణ ఉద్యమకారుల వేదిక మండల అధ్యక్షులు చెప్యాల నిరంజన్ రావు అధ్యక్షతన తెలంగాణ ఉద్యమకారుల వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమ సాధనలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేశవరావు ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం అమరుల కుటుంబాలను గౌరవించడం, కేసులు నమోదైన వారిని, జైలుకు వెళ్లిన వారిని, ఉద్యమంలో ప్రత్యక్షంగా పరోక్షంగా పాల్గొన్న వారిని మండల కమిటీలు గుర్తించి రాష్ట్ర కమిటీకి సిఫార్సు చేయాలని సూచించారు. తెలంగాణ ఉద్యమ సాధనలో ఆత్మబలిదానాలు చేసుకున్న అమరులకు తెలంగాణ ఉద్యమకారులు రెండు నిమిషాలు మోనం పాటించి నివాళులర్పించారు. అనంతరం పలు విషయాలు చర్చించి తీర్మానాలు చేశారు. అనంతరం మండలానికి చెందిన పలువురు ఉద్యమకారులను శాలువులతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కార్యదర్శి ఎల్తురు శంకర్, జిల్లా అధ్యక్షులు గోగర్ల రాజేశం, తాండూర్ మండలం ఉద్యమకారులు మాసాడి శ్రీరాములు, సురభి ఆగంరావు, బోడ సతీష్, మద్దిబోయిన అర్జున్, హనీఫ్, శేఖర్, నర్సింహస్వామి, కొమరయ్య, రఘుపతి, జయరాం, తదితరులు పాల్గొన్నారు.



# విద్యాసంస్థలా.. వ్యాపార కేంద్రాలా?

**- సీవైఎస్ఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శీతల్కర్ అరవింద్**



**భైంసా, జూన్ 07, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లావ్యాప్తంగా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థల ఇష్టారాజ్యంపై, వాటిని నియంత్రించడంలో విద్యాశాఖ అధికారుల నిరక్ష్యంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకప్పుడు విద్యను సేవగా భావిస్తే, నేడు కొందరు దానిని పూర్తిస్థాయి వ్యాపారంగా మార్చేశారని ఛాత్ర యువ సంఘర్షణ సమితి (సీవైఎస్ఎస్) నిర్మల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శీతల్కర్ అరవింద్ ఆరోపించారు. జిల్లాలోని 19 మండలాల్లో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తల్లిదండ్రుల ఆశలను, పిల్లల భవిష్యత్తుపై ఉన్న ఆందోళనలను ఆసరాగా చేసుకుని భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలోని ప్రతి మండలంలోనూ ఐఐటీ, జేఈఈ మెయిన్స్, నీట్ ఫౌండేషన్, ఒలింపియాడ్, టెక్నో, కాన్సెప్ట్, ఇంటర్నేషనల్, గ్లోబల్, వరల్డ్ క్లాస్ స్కూల్ వంటి ఆకర్షణీయమైన తోక పేర్లతో బోర్డులు తగిలించి అడ్మిషన్ల దందా సాగిస్తున్నారని విమర్శించారు. ఈ పేర్లను నమ్మి మధ్యతరగతి కుటుంబాలు అప్పులు చేసి మరీ ఫీజులు చెల్లిస్తున్నాయని, అయితే ఈ పేర్ల వెనుక నాణ్యమైన విద్య ఉందా లేదా అనే అంశంపై అధికారుల పర్యవేక్షణ కరువైందన్నారు. చిన్న పిల్లలపై ఉదయం ప్రత్యేక క్లాసులు, సాయంత్రం కోచింగ్, వీకెండ్ టెస్టులు, స్టడీ అవర్స్ పేరిట మానసిక ఒత్తిడి పెంచుతూ వారి బాల్యాన్ని దూరం చేస్తున్నారని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ పాఠశాలలు సైతం ఇంటర్నేషనల్ అనే పదాన్ని వాడుతూ సాధారణం కంటే రెండు మూడు రెట్లు ఎక్కువ ఫీజులు వసూలు చేస్తున్నాయని, వీటికి ఏ బోర్డు అనుబంధం ఉందో, ఎలాంటి అనుమతులు ఉన్నాయో స్పష్టత లేదన్నారు. అడ్మిషన్ల కోసం భారీ ఫ్లెక్సీలు, 100 రిజల్ట్ అంటూ తప్పుడు ప్రకటనలు ఇస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. పాఠశాలలు సూచించిన నిర్దిష్ట దుకాణాల్లోనే పుస్తకాలు, యూనిఫాంలు కొనాలని తల్లిదండ్రులను బలవంతం చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో అనుమతులు లేని పాఠశాలలు ఎలా కొనసాగుతున్నాయని, మౌలిక సదుపాయాలు లేకున్నా గుర్తింపులు ఎలా ఇస్తున్నారని శీతల్కర్ అరవింద్ ప్రశ్నించారు. తనిఖీలు చేయాల్సిన అధికారులు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నారని ఆరోపించారు. జిల్లాలోని 19 మండలాల్లో నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై ప్రత్యేక విచారణ జరపాలని, ఐఐటీ, ఇంటర్నేషనల్ వంటి పేర్ల వినియోగంపై నిబంధనలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణ కమిటీని, తల్లిదండ్రుల ఫిర్యాదుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసి, నిబంధనలు ఉల్లంఘించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# లాడ్జీలపై స్పెషల్ డ్రైవ్

**- డ్రగ్స్, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై డీసీపీ ప్రత్యేక నిఘా**

**మంచిర్యాల, జూన్ 7, ప్రభాతవార్త**



మంచిర్యాల పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల అరికట్టే లక్ష్యంతో శనివారం రాత్రి మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్ ఆధ్వర్యంలో అర్ధరాత్రి ప్రత్యేక పోలీసు బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. పట్టణంలోని పలు లాడ్జీలు, హోటళ్లలో తనిఖీలు చేపట్టిన అధికారులు అతిథుల వివరాలు, రిజిస్టర్ నమోదులు, సీసీ కెమెరాల పనితీరు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా లాడ్జీల యాజమాన్యాలకు డీసీపీ పలు కీలక సూచనలు చేశారు. గదులు కేటాయించే ముందు ప్రతి వ్యక్తి నుంచి ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని, అతిథుల పూర్తి వివరాలను నమోదు చేసి భద్రపరచాలని ఆదేశించారు. లాడ్జీలలో అసాంఘిక కార్యకలాపాలు, అనైతిక వ్యాపారాలు నిర్వహించినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రహదారులపై డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీసీపీ స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఇదే సమయంలో డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసు బృందం అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు అవగాహన కార్యక్రమాలతో పాటు కఠిన నిఘా కొనసాగిస్తున్నట్లు డీసీపీ తెలిపారు. డ్రగ్స్ విక్రయించే వారు, వినియోగించే వారిపై రాజీ లేకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీసీపీ వెంట పట్టణ ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు, ఎస్సై మధుసూదన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల భద్రత, ప్రశాంత వాతావరణ పరిరక్షణ కోసం ఇటువంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని డీసీపీ పేర్కొన్నారు. పోలీసు శాఖ చర్యలకు ప్రజలు, వ్యాపార వర్గాలు సహకరించాలని కోరారు.

# పశువైద్య సిబ్బంది సాధారణ బదిలీలు

**నేరడిగొండ, జూన్ 07, ప్రభాతవార్త:**

సాధారణ బదిలీలలో భాగంగా నేరడిగొండ మండలంతో పాటు పరిసర ప్రాంతాల పశువైద్య సిబ్బంది స్థానచలనం చెందారు. ఇచ్చోడ మండల ప్రాథమిక పశువైద్య కేంద్రంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సంధ్య నేరడిగొండ మండల ప్రాథమిక పశువైద్య కేంద్రానికి బదిలీపై వచ్చారు. అదేవిధంగా నేరడిగొండలో పనిచేస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ గోవింద్ నాయక్‌ను మండలంలోని వాంకిడి ప్రాథమిక పశువైద్య కేంద్రానికి కేటాయించారు. ఇన్నాళ్లూ ఇక్కడ పశువైద్యాధికారిగా పనిచేసిన డాక్టర్ సుశీల్ సోనాల మండల కేంద్రంలోని ప్రాథమిక పశువైద్య కేంద్రానికి బదిలీపై వెళ్లారు. మరోవైపు మామడ మండలంలోని తాండ్ర సబ్ సెంటర్‌లో లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్ వాంకిడి ప్రాథమిక పశువైద్య కేంద్రానికి బదిలీపై వచ్చారు. ఇక్కడ లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అరుణ్ ఆదిలాబాద్ కేంద్రానికి బదిలీ అయ్యారు. ఈ బదిలీల ఉత్తర్వుల ప్రకారం ఆయా అధికారులు, సిబ్బంది తమ కొత్త స్థానాలలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

# చేసిన మంచి పనులే, ప్రజలలో చిరస్థాయిగా నిలుపుతాయి

**జన్నారం, జూన్ 7, ప్రభాతవార్త**

పదవిలో ఉన్నప్పుడు ప్రజలకు చేసిన సేవలు మంచి పనులు, బదిలీపై వెళ్లిన తర్వాత కూడా చిరస్థాయిగా ఆ పనులు నిలుస్తాయని, తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ గుగులావత్ సంగీత రవి నాయక్, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షులు జాడి గంగాధర్ అన్నారు. ఆదివారం జన్నారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా, ఏడు సంవత్సరాలు విధులు నిర్వహించి, బదిలీపై దండపల్లి మండలం అల్లీపూర్ గ్రామ కార్యదర్శిగా బదిలీపై వెళ్లిన మేక లావణ్యకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మేక లావణ్య కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడపడానికి కృషి చేశారన్నారు. ఏడు సంవత్సరాల తమ విధులలో ఎన్నడు కూడా వివాదాలు లేకుండా తమ పాలనను సాగించారన్నారు. అదేవిధంగ లావణ్య మాట్లాడుతూ, గ్రామాన్ని అభివృద్ధి చేయడంలో గ్రామ ప్రజలు పాలకవర్గ సభ్యుల సహకారం ఎంతో అందించారన్నారు. వారి సహకారానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. జాడి గంగాధర్ సర్పంచ్‌గా ఉన్న సమయంలో, తను కొత్తగా కార్యదర్శిగా విధుల్లోకి చేరానన్నారు. ఆ కాలంలో తనకు ఎన్నో పనులు నేర్పిస్తూ, ప్రభుత్వ జీవోలో ప్రకారం ఎలా మెలగాలో, ప్రజల్లో ఎలా ఉండాలో, అభివృద్ధి ఎలా చేయాలో, తమకు క్షుణ్ణంగా వివరిస్తూ తమను ముందుకు నడిపించారన్నారు. తిమ్మాపూర్ గ్రామంలో తమ మొట్టమొదటి పోస్టింగ్ కావడంతో ఇక్కడే ఎన్నో కొత్త అనుభవాలు నేర్చుకున్నామన్నారు. గ్రామస్తులు ఎంతో సహకరించారన్నారు. తిమ్మాపూర్ సర్పంచ్‌గా జాడి గంగాధర్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులంతా కలిసి తమకు సహకరించారని అన్నారు. అలాగే కొత్తగా ఎన్నికైన నూతన పాలకవర్గ సభ్యులు కూడా ఆరు నెలల నుంచి తమకు సహకరించారన్నారు.

## గ్రామ నూతన కార్యదర్శి కళ్యాణికి శాలువాతో సత్కారం

అలాగే తిమ్మాపూర్ గ్రామ కార్యదర్శిగా జన్నారం మండలంలోని బంగారు తండా గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహించి తిమ్మాపూర్ కార్యదర్శిగా వచ్చిన కళ్యాణికి గ్రామ, పాలకవర్గ సభ్యులు నాయకులు, పెద్దలు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కళ్యాణి, ఉప సర్పంచ్ నాగేష్, మాజీ ఉపసర్పంచ్ అసునూరి పద్మ, వాడు సభ్యులు సిద్ధం స్వప్న, దేవికా కృష్ణవేణి కు కాటికారి జ్యోతి, మల్లేష్ బోర్లకుంట శంకరయ్య, నాయకులు, గుగ్లావత్ రవి, జాడీ వెంకటయ్య, చిందం చంద్రయ్య, బొర్లకుంట వెంకటమ్మ, జునుగురి మల్లయ్య, జాడి రాజన్న, జునుగిరి లక్ష్మి, జాడి లక్ష్మి, అంగన్వాడీ టీచర్లు సంజీవ రాణి జాముని ఆశా వర్కర్ రజిత, యుగంధర్ శ్రీనివాస్, అమ్మల భూమయ్య, సుధాకర్ భూమయ్య, చిందం శ్రీనివాస్, శ్రావణ్ మల్లేష్, కే శివాజీ, రక్షణ రావు ఆనందం తదితరులు పాల్గొన్నారు.



# మృగశిర కార్తె వచ్చింది... వర్షం జాడ లేదు



## చేపల సందడి కనిపించినా.. వాన కోసం రైతన్నల ఎదురు చూపులు

**మంచిర్యాల, జూన్ 7, ప్రభాతవార్త**

వ్యవసాయానికి ఎంతో కీలకమైన మృగశిర కార్తె నేడు ప్రారంభమైనప్పటికీ, ఉష్ణోగ్రతలు తగ్గక ఎండ వేడిమితో ప్రజలు అల్లాడుతున్నారు. ఆశించిన వర్షాలు కురవకపోవడంతో రైతాంగంలో నిరాశ నెలకొంది. సాధారణంగా మృగశిర కార్తెతోనే నైరుతి రుతుపవనాలు బలపడి వర్షాలు ప్రారంభమవుతాయని రైతులు భావిస్తారు. అయితే ఈ ఏడాది మృగశిర కార్తె ప్రవేశించిన రోజు కూడా ఆకాశంలో మేఘాలు కనిపించిన వర్షం మాత్రం కురవకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగు కోసం ఇప్పటికే రైతులు పొలాలను సిద్ధం చేసుకున్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. కానీ వర్షాలు ఆలస్యమవుతుండటంతో సాగు పనులు ముందుకు సాగడం లేదు. గ్రామాల్లో రైతులు ఆకాశం వైపు ఆశగా చూస్తూ మంచి వానల కోసం ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉండగా, మృగశిర కార్తె సందర్భంగా చేపల కొనుగోళ్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల్లో మృగశిర రోజు చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదనే విశ్వాసం తరతరాలుగా కొనసాగుతోంది. దీంతో చేపల మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా రోహు, కట్ల, ముర్రెలు వంటి చేపలకు మంచి డిమాండ్ కనిపించింది. అలాగే హైదరాబాద్‌లో ప్రతి సంవత్సరం నిర్వహించే ప్రసిద్ధ ఖగచేప మందుగ కార్యక్రమం గురించి కూడా ప్రజల్లో చర్చ జరుగుతోంది. శ్వాస సంబంధిత సమస్యలు, ఆస్తమా వంటి వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుందనే నమ్మకంతో కొందరు చేప మందు తీసుకుంటారు. అయితే చేప మందు ప్రభావంపై శాస్త్రీయ ఆధారాలు పరిమితంగానే ఉన్నాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. అందువల్ల ప్రజలు వైద్యుల సూచనలను కూడా పాటించాలని సూచిస్తున్నారు. మృగశిర కార్తె రోజు సంప్రదాయాలు, చేపల విందులతో సందడి కనిపించినప్పటికీ, రైతుల దృష్టి మాత్రం వర్షాలపైనే ఉంది. త్వరలో మంచి వర్షాలు కురిసి ఖరీఫ్ సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడాలని రైతులు కోరుకుంటున్నారు.

## ఈతకు వెళ్లి వాగులో మునిగి బాలుడి మృతి

**హాజీపూర్, జూన్ 07, ప్రభాతవార్త**

ఈత సరదా ఒక బాలుడి ప్రాణం తీసింది. హాజీపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గుడిపేట గ్రామానికి చెందిన బోగిరి సందీప్ (15) 9వ తరగతి పూర్తి చేసి ఈ సంవత్సరం 10వ తరగతి చదువుతున్నాడు. మృతుడు సందీప్ శనివారం మధ్యాహ్నం తన స్నేహితులు అభినయ్, అక్షయ్, అశ్విత్, రాంచరణ్ లు కలిసి ఈత కొట్టడానికి ముల్కల్లలోని ర్యాలీ వాగు డ్యామ్ వద్దకు వెళ్లారు. సాయంత్రం అయిన తిరిగి ఇంటికి రాలేదు. మృతుని తండ్రి కొడుకు గురించి చుట్టూ పక్కల మరియు స్నేహితుల వద్ద తెలుసుకున్న ఆచూకీ దొరకలేదు. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ముల్కల డ్యామ్ నీటిలో సందీప్ శవం కనిపించింది. శవాన్ని పోస్టుమార్టం కొరకు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి కీ పంపించినట్లు ఎస్ఐ తెలిపారు.

## వరి తరలింపును వేగవంతం చేయాలి

### - అదనపు కలెక్టర్ వడాల రాములు

**వేమనపల్లి, జూన్ 7, ప్రభాతవార్త**

మండలంలోని వరి కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని సకాలంలో తరలించేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వడాల రాములు అధికారులను ఆదేశించారు. ఆదివారం గొర్లపల్లి ప్యాక్స్, దస్నాపూర్ డీసీఎంఎస్ పీపీసీలను సందర్శించిన ఆయన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు, రవాణా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వరి లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైన చోట అదనపు హమాలీలను ఏర్పాటు చేయాలని పీపీసీ ఇన్‌చార్జ్‌లకు సూచించారు. అనంతరం వేమనపల్లి తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వరి రవాణా పురోగతిని తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో మిగిలి ఉన్న ధాన్యాన్ని ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించేందుకు అదనపు వాహనాలను అందుబాటులో ఉంచాలని రవాణా కాంట్రాక్టర్లకు ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వరి సేకరణ, రవాణా ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సాయికృష్ణ, ఆర్ఐ ఖాలీక్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## విత్తనాలు వేసేందుకు తొందరపడొద్దు

### - మండల వ్యవసాయ అధికారి కృష్ణవేణి

**నేరడిగొండ, జూన్ 07, ప్రభాతవార్త:**

వర్షాకాలం ప్రారంభం కావడంతో జిల్లాలోని రైతాంగం వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. తొలి జల్లులు కురవగానే కొందరు రైతులు ఉత్సాహంతో విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతుండగా, మరికొందరు ఇప్పటికే విత్తడం ప్రారంభించారు. అయితే, ఇలా తొందరపడి విత్తనాలు వేయడం వల్ల రైతులకు భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని మండల వ్యవసాయ అధికారి కృష్ణవేణి తెలిపారు. నేలలో తగినంత తేమ శాతం లేనప్పుడు విత్తనాలు వేస్తే మొలక శాతం గణనీయంగా తగ్గిపోతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న వంటి వాణిజ్య పంటల విత్తనాలు వేసేటప్పుడు రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. సరైన తేమ లేకుండా విత్తడం వల్ల శ్రమ, పెట్టుబడి రెండు వృథా కావడమే కాకుండా, తిరిగి విత్తనాలు కొనుగోలు చేయాల్సి రావడం వల్ల ఆర్థిక భారం పెరుగుతుందని హెచ్చరించారు. ప్రస్తుత తరుణంలో పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడం వల్ల భూమిలోనిపై అంగుళం పొర వరకు మాత్రమే తేమ లభిస్తుందన్నారు. కాబట్టి నేలలో కనీసం 60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదై, భూమి లోపలి వరకు తగినంత తేమ చేరిన తర్వాతే విత్తనాలు నాటడం ప్రారంభించాలని స్పష్టం చేశారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి నష్టపోకుండా చూసుకోవాలని కోరారు.

## 17 ఏళ్ల తర్వాత ఒకే చోటికి..

### - పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**సారంగాపూర్, జూన్ 07, ప్రభాతవార్త:**



మండలంలోని కౌట్ల(బి) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2008-2009 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక స్వర్ణ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. సుదీర్ఘమైన 17 ఏళ్ల తర్వాత సహచర విద్యార్థులంతా ఒకే వేదికపైకి చేరుకున్నారు. చాలా రోజులకు ఒకరినొకరు కలుసుకోవడంతో అందరూ ఆనందోత్సాహాల మధ్య తమ చిన్ననాటి స్మృతులను, పాఠశాల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పించి, జీవితంలో ఉన్నత స్థానాల్లో నిలబెట్టిన గురువులను ఆత్మీయంగా ఆహ్వానించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. తమ వద్ద చదువుకున్న విద్యార్థులు నేడు సమాజంలో వివిధ రంగాలలో స్థిరపడడంపై గురువులు ఎంతో గర్వపడుతున్నట్లు ఆనందం వ్యక్తంచేశారు. వృత్తి, ఉద్యోగ వ్యాపారాలలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, పాత మిత్రులంతా కలిసి ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు నాయకులు

## ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలి

### - తాండూర్ ఎంఈఓ దుర్గం శ్రీనివాస్

**తాండూర్, జూన్ 7, ప్రభాతవార్త :**

ప్రభుత్వ పాఠశాలలనే తమ పిల్లలను వారి తల్లిదండ్రులు చేర్పించాలని మండల విద్యాధికారి దుర్గం శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గోపాల్ నగర్ లో ఆదివారం ఆచార్య జయశంకర్ బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులతో పాటు నాణ్యమైన విద్య అందుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరసయ్య, టీచర్ ఆనంద్, మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మున్నూరు కాపు సంఘం నూతన కమిటీ ఎన్నిక

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 7, ప్రభాతవార్త :**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మున్నూరు కాపు సంఘం నూతన జిల్లా కమిటీ ఎన్నికలు ఆదివారం నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షులుగా పెద్దపెల్లి కిషన్ రావు పటేల్, ప్రధాన కార్యదర్శిగా జగడం సత్యనారాయణ పటేల్, కోశాధికారిగా మణిగోండ వెంకటేశం పటేల్ ఎన్నికయ్యారు. అదేవిధంగా మహిళా విభాగం అధ్యక్షురాలిగా కుందారం శంకరమ్మ పటేల్, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా గుర్రాల హరిప్రియ పటేల్, యువజన విభాగం అధ్యక్షుడిగా గడ్డల సురేష్ పటేల్, ప్రధాన కార్యదర్శిగా పిరిసింగుల కోటేష్ పటేల్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులకు మున్నూరు కాపు సంఘం సిర్పూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గోలెం వెంకటేశం పటేల్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. వారి నాయకత్వంలో సంఘం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు సంఘ అభివృద్ధికి, సామాజిక సంక్షేమానికి, మున్నూరు కాపు సమాజ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపారు.

## పోచమ్మ తల్లికి ఘనంగా జలాభిషేకం

### - సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ప్రత్యేక పూజలు

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 7, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడ గ్రామంలో గ్రామదేవత పోచమ్మ తల్లికి మూడు రోజులపాటు భక్తిశ్రద్ధలతో జలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బిందెలతో నీళ్లు మోసుకుంటూ గ్రామ వీధుల గుండా భక్తి శ్రద్ధలతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి జలాభిషేకం చేసి ప్రత్యేక మొక్కలు సమర్పించారు. సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతుల పొలాల్లో పంటలు బాగా పండాలని, గ్రామంలో సుఖశాంతులు నెలకొనాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని పోచమ్మ తల్లిని వేడుకున్నారు. మూడు రోజులపాటు జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.



జలాభిషేకం చేసేందుకు వెళ్తున్న మహిళలు



## ముస్లిం మైనార్టీలకు బలోపేతం

### - సంఘటన్ సృజన అభియాన్ సమావేశం విజయవంతం

**బెల్లంపల్లి, జూన్ 07, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని ఎమ్మెన్నార్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ముస్లిం మైనార్టీల సమావేశం ఘనంగా నిర్వహించడం జరిగింది. సంఘటన్ సృజన అభియాన్ కార్యక్రమం పేరుతో నిర్వహించిన ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ 37వ వార్డు కార్పొరేటర్, మైనార్టీ జిల్లా చైర్మన్ ఖలీద్ భాయ్ ఆధ్వర్యం వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఏ లతీఫ్ జిల్లా పరిశీలకులుగా హాజరై, కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారికి ఘన సన్మానం నిర్వహించారు. సభలో మంచిర్యాల జిల్లా మేయర్ మధు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రఘునాథ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కోఆప్షన్ సభ్యులు మినహాజ్, ఆరిఫ్, కార్పొరేటర్లు, బెల్లంపల్లి మైనార్టీ మాజీ అధ్యక్షులు మొహమ్మద్ గౌస్ భాయ్, తాండూర్ మండల అధ్యక్షులు ఈసా భాయ్, అడ్వకేట్ జుబేర్, ఖాజా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు, కార్యకర్తలకు బయోడేటా ఫారమ్‌లు పంపిణీ చేసి, పార్టీలో చురుకైన భాగస్వామ్యం కల్పించాలని పిలుపునిచ్చారు. మైనార్టీల అభివృద్ధి, రాజకీయ భాగస్వామ్యం పెంపుదల కోసం ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని నాయకులు తెలిపారు.



## సీసీ రోడ్డు పనుల పరిశీలన మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

**భైంసా, జూన్ 07, ప్రభాతవార్త:**

భైంసా మండలంలోని కోలూరు తండాలో రూ.15 లక్షల వ్యయంతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ముధోల్ మాజీ శాసనసభ్యులు జి. విఠల్‌రెడ్డి పరిశీలించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో ఈ నిధులు మంజూరయ్యాయి. తండాలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతను ఈ సందర్భంగా ఆయన తనిఖీ చేశారు. తమ తండాకు రూ.15 లక్షల నిధులు కేటాయించి సీసీ రోడ్డు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డిలకు తండావాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పవార్ నిర్మల గణేష్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాజన్న, మాజీ ఆత్మ చైర్మన్ పోత రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు జే. ధర్మేందర్, కరీం, శంకర్ పటేల్, ఎస్కే సలీం, ప్రకాష్ జాదవ్, బాలాజీ, మారుతి, మధుసూదన్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్‌లో కాంగ్రెస్ బీఎల్ఏలకు ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక శిక్షణ

**- బీఎల్ఏలు ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహనతో అప్రమత్తంగా వ్యవహరించాలి - ఎమ్మెల్సీ దండే విఠల్**

**- ఎన్నికల విజయానికి బీఎల్ఓలే బలమైన సైన్యం - డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ**







**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 7, ప్రభాతవార్త :**

సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని కాగజ్‌నగర్ పట్టణంలోని రన్ గ్రాండ్ హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియలో ఏకపక్ష విధానాలను అవలంబిస్తూ ఓటర్ల జాబితాలపై ప్రభావం చూపే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించకుండా అప్రమత్తంగా ఉండటం బీఎల్ఏల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి బూత్ ఏజెంట్ ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహనతో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఓటరు జాబితాల పరిశీలన, సవరణలు, కొత్త ఓటర్ల నమోదు, ఎన్నికల నిబంధనలు తదితర అంశాలపై బీఎల్ఏలు పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని ఆయన తెలిపారు. రాబోయే ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ మాట్లాడుతూ, ఎన్నికల విజయానికి బీఎల్ఏలే పార్టీకి బలమైన సైన్యమని అన్నారు. బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో బీఎల్ఏల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మోహన్, నరేష్ రాథోడ్ బీఎల్ఏలకు ఎన్నికల సంఘం నిబంధనలు, ఓటరు జాబితాల నిర్వహణ, బూత్ స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రత్యేక శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కమ్మె అనిల్, మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురే శ్యాంరావు, కాగజ్‌నగర్ కౌన్సిలర్లు ఎమ్మాజీ శారద సంతోష్, కచ్చకాయల జ్యోతి, దుర్గం సూరజ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లాడి రాజు, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరి మృతి

**జన్నారం, జూన్ 7, ప్రభాతవార్త**



జన్నారం మండలం చింతగూడెం గ్రామానికి చెందిన గజ్జెల భూపతి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన విషాద సంఘటన చోటు చేసుకుంది. చింతగుడెం గ్రామానికి చెందిన గజ్జెల మల్లేష్ కుమరుడు భూపతి, వారి పాలేరు అయిన లచ్చుతో కలిసి గ్రామ శివారు లోని వ్యవసాయ భూమిలో మొక్కజొన్న పంట వ్యర్థాలను తొలగించడానికి వెళ్లారు. అతను బహిర్భూమికి వెళ్లి బావి వద్దకు కడుక్కోవడం కోసం వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి నీట మునిగి మృతి చెందారని జన్నారం ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

### - ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు

**మంచిర్యాల, జూన్ 7, ప్రభాతవార్త**

ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటియుసి) రాష్ట్ర మహాసభలు సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో కరీంనగర్‌లో జరగనున్న నేపథ్యంలో వాటిని విజయవంతం చేయాలని ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి మేకల దాసు పిలుపునిచ్చారు. పట్టణ 4వ మహాసభ ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మేకల దాసుతో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ, కార్మికుల పరిస్థితి రోజురోజుకూ అధ్వాన్నంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు క్రమబద్ధీకరణ లేకపోవడం, కనీస వేతనాలు అమలు కాకపోవడం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కార్మికుల సమస్యల పరిష్కారంపై సరైన దృష్టి సారించడం లేదని విమర్శించారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని, రాష్ట్ర మహాసభలను విజయవంతం చేసి కార్మికుల గొంతుకను బలంగా వినిపించాలని పిలుపునిచ్చారు.

**నూతన పట్టణ కమిటీ ఎన్నిక**

ఈ మహాసభల ఏఐటియుసి పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా బి. విజయలక్ష్మి, ఉపాధ్యక్షుడుగా, పోరండ్ల సంపత్, ప్రధాన కార్యదర్శిగా మధు, కార్యదర్శిగా పానుగంటి సత్యనారాయణ, కమిటీ సభ్యులుగా, కుసుమ, అరుణ, హరీష్, ప్రశాంత్, రాకేష్, రజినీ, కె. పద్మ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కలిందర్ అలీ ఖాన్, మిట్టపల్లి పోలు, దేవి పోచన్న, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.





## ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

### * సర్పంచ్ సాహెబ్‌రావు

**సారంగాపూర్, జూన్ 07, ప్రభాతవార్త:**



మండలంలోని కంకేట గ్రామంలో సర్పంచ్ సాహెబ్‌రావు ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం ఆదివారం ఉత్సాహంగా సాగింది. ఇందులో భాగంగా సర్పంచ్, ఉపాధ్యాయులు కలిసి గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. బడి వయసు గల పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ సాహెబ్‌రావు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు పంపి వేలాది రూపాయల డబ్బును వృథా చేసుకోవద్దని, ప్రభుత్వ బడుల్లోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ఉన్నతమైన, నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ చదివిన వారితో విద్యాబోధన చేయిస్తుంటారని, కానీ ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నో ఉన్నత విద్యలు అభ్యసించి, కఠినమైన పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన ఉపాధ్యాయులు ఉంటారని గుర్తుచేశారు. అటువంటి అర్హత గల గురువులపై భరోసా ఉంచి పిల్లలను సర్కారు బడికి పంపాలని, వారు పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత శిఖరాలకు చేరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను రైతులు, కూలీలు, మధ్యతరగతి కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.